శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## నిండు జీవితానికి రెండు చుక్కలు : ఎమ్మెల్యే



**గూడూరు, జూన్ 28, ప్రభాతవార్త** పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ నందు పిల్లలకు పోలియో చుక్కలు వేసి, తల్లిదండ్రులు చిన్నారులకు వేయించాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపుగా 49 లక్షల మంది పిల్లలుకు వ్యాక్సిన్ వేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. గూడూరు పట్టణంలో 60 కేంద్రాలు ఏర్పాటు చేశారని, అదే విధంగా 5 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతి చిన్నారుల తల్లిదండ్రులు ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి వారి భవిష్యత్‌ను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కండలేరులో 32,720 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జూన్ 28, ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో ఆదివారం ఉదయానికి 32,720 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జలాశయం నుండి లో లెవల్ స్లూయిస్ ద్వారా 30 క్యూసెక్కులు, కండలేరు హెడ్ రెగ్యులేటం ద్వారా 850 క్యూసెక్కులు, హెడ్ రెగ్యులేటర్ పవర్ హౌస్ ద్వారా 1235 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2115 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

# రాష్ట్ర అభివృద్ధే మా ఆకాంక్ష

- ఏటా రొట్టెల పండగలో అదే కోరిక - ఏటికేటికీ పెరిగిపోతున్న భక్తుల సంఖ్య - దర్గా ప్రాంగణంలో భక్తుల కోసం చేసిన ఏర్పాట్లు అద్భుతం
- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్





**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త-వైద్యం:** : రాష్ట్ర అభివృద్ధే తమ ఆకాంక్ష అని, ఏటా రొట్టెల పండగలో అదే కోరిక కోరుటమని, రొట్టెల పండగకు భక్తుల సంఖ్య ఏటికేటికీ పెరిగిపోతోందని, దర్గా ప్రాంగణంలో భక్తుల కోసం చేసిన ఏర్పాట్లు అద్భుతమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లు అన్నారు. వారు ఆదివారం రొట్టెల పండగ సందర్భంగా నెల్లూరు బారాషహీద్ దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి బారాషహీదులను దర్శించుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే గొప్ప పుణ్యక్షేత్రం బారా హషీద్ దర్గా అని, నెల్లూరులో ఈ దర్గా ఉండటం జిల్లా ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ఏటా రొట్టెల పండగ సందర్భంగా ఇక్కడకు వచ్చి రాష్ట్ర అభివృద్ధిని కోరుకోవడం మాకు సంప్రదాయంగా వస్తోందన్నారు. గతంలో రొట్టెల పండగకు 4 లక్షల మంది హాజరైతే, ఇప్పుడు ఆ సంఖ్య 18 లక్షలకు చేరడం సంతోషంగా ఉందన్నారు. ఎన్ని లక్షల మంది వచ్చినా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తుండటం గొప్ప విషయమన్నారు. అందులో భాగంగా మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్. అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. అదేవిధంగా అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో కసుమూరులో నిత్యాన్నదానం ప్రారంభించడంతో పాటు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. అనంతరం ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రొట్టెల పండగను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. దర్గా ప్రాంగణంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇటీవల జరిగిన ఘటనలను సమీక్షించుకుని, భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. దర్గా ప్రాంగణాన్ని మరింత విస్తరించే ఆలోచన ఉందన్నారు. శనివారం రాత్రి నిర్వహించిన గంధోత్సవానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చినా పోలీసులు పకడ్బందీగా పనిచేయడంతో చిన్న అవాంఛనీయ ఘటన కూడా చోటుచేసుకోలేదని తెలిపారు. దర్గా ప్రాంగణంలో ఎవరైనా తప్పిపోతే అప్పటికప్పుడే సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా చైర్మన్ మునీర్ అహ్మద్, బొమ్మి సురేంద్ర, సాబీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# రొట్టెల పండగకు మూడో రోజు భక్తజన ప్రభంజనం

- ఆదివారం సెలవు దినం కావడంతో ఒక్కసారిగా పెరిగిన రద్దీ - భక్తులతో కిక్కిరిసిన దర్గా రహదారులు
- సుమారు 6 లక్షల మందికి పైగా విచ్చేసిన భక్తులు - ఉద్యోగం, వివాహం, సంతానం రొట్టెలకు డిమాండ్ - పటిష్ఠ ఏర్పాట్లతో భక్తుల సంతృప్తి



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త – కలెక్టరేట్** నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు మూడో రోజు భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. సుమారు 6 లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఎండ బాగా వున్నప్పటికీ భక్తుల రద్దీ కొనసాగింది. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజిత వేజెండ్ల, మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

**- కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం**

కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ఉద్యోగం వివాహం సంతాన రొట్టెలకు డిమాండ్ పెరిగింది. జిల్లా యంత్రాంగం పటిష్ఠంగా చేపట్టిన ఏర్పాట్ల పట్ల సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**- పోలీసు కంట్రోల్ రూం సేవలు భేష్..**

దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ఠ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీస్ కంట్రోల్ రూం 24 గంటలు అనౌన్స్మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు. భక్తులు పోగొట్టుకున్న పర్సులను అందిస్తున్నారు. దీంతో పోలీసు కంట్రోల్ రూం సేవలను అందరూ శభాష్ అని మెచ్చుకుంటున్నారు.

**- పారిశుధ్య సిబ్బంది సేవలు భేష్..**

దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదరాన్ని తొలగిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా శుభ్రపరుస్తున్నారు. దీంతో దర్గా పరిసరాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ నందన్, హెల్త్ ఆఫీసర్ చైతన్య ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

**వైద్య శిబిరాలను వినియోగించుకుంటున్న భక్తులు**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేక వైద్యులను, సిబ్బందిని బ్యాచ్‌ల వారీగా నియమించి 24 గంటలూ భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం భక్తులను అంబులెన్స్‌ల ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నారు. మూడురోజుల్లో సుమారు 3000 మంది పైగా భక్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత తెలిపారు.

**- అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ..**

స్వర్ణాల చెరువులో ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. 24 గంటలూ అప్రమత్తంగా బోట్లు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచారు. దర్గా ఆవరణలో అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచారు.

# రెండు దశాబ్దాల మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

**- ఎమ్మెల్యే చొరవతో**



**కోవూరు, జూన్ 28 ప్రభాతవార్త :** గత రెండు దశాబ్దాలుగా గెలిచిన ఎమ్మెల్యేలు ఎవరూ కూడా ఈ మురుగు కాలువల సమస్యపై ఆశించిన మేర దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. ఫలితంగా ఆ ప్రాంత ప్రజలు ఈ మురుగుతో గత రెండు దశాబ్దాలుగా అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో కాదు.. నియోజకవర్గంలోని పడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్‌లో చోటు చేసుకుంది. ఈ నేతాజీనగర్ ప్రాంతంలో మురుగంతా ఒక చోట నిలిచిపోయి.. దోమల స్వైర విహారంతో ఆ ప్రాంత ప్రజలు నిత్యం అల్లాడిపోయే వారు. గతంలో గెలిచిన శాసనసభ్యులకు తమ మొర వినిపించినా ఆలకించే నాధుడే కరువయాౢరు. ఈ నేపథ్యంలో ఈ సమస్యను ఆ ప్రాంత నాయకులు జెట్టి మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఆమె స్పందించి స్వయంగా ఆ కాలువను పరిశీలించి నుడా ఆధ్వర్యంలో ఈ కాలువ పరిష్కారానికి 20 లక్షల నిధులను యుద్ధప్రాతిపదికన మంజూరు చేసేలా చొరవ తీసుకున్నారు. దీంతో వెంటనే ఆ ప్రాంతంలో పనులు కూడా ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# దాదాపు 40 సంవత్సరాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం

- చరిత్ర సృష్టించే అభివృద్ధి నెల్లూరు రూరల్‌లో జరుగుతోంది - నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి





**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో దాదాపు 40 సంవత్సరాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని, చరిత్ర సృష్టించే అభివృద్ధి నెల్లూరు రూరల్‌లో జరుగుతోందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గత 10 సంవత్సరాలలో చేయలేని పనులను ఈ రెండేళ్లలో చేసి చూపించామన్నారు. నేడు నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని ములుమూడి గ్రామంలో 83 లక్షల రూపాయలతో నిర్మించిన ములుమూడి కలుజుపై బ్రిడ్జిని జిల్లా కలెక్టర్ హిమాన్ష శుక్ల రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. చెప్పిన మాట ప్రకారం 6 నెలల్లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలు కలుజు మీద బ్రిడ్జి పూర్తిచేసి చూపించారని జిల్లా కలెక్టర్ హిమాన్ష శుక్ల తెలిపారు. తన దృష్టికి ఏ సమస్య వచ్చినా తన వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్ హిమాన్ష శుక్ల తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జిల్లా కలెక్టర్ సహకారంతో ములుమూడి కలుజు మీద బ్రిడ్జి పూర్తి చేశామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. మరో 2 నెలల్లో పొట్టేపాలెం కలుజు మీద బ్రిడ్జి పూర్తి చేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం



**ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి**

**కావలి, జూన్ 28 ప్రభాతవార్త :** యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి వ్యక్తం చేశారు. మండలంలోని రామచంద్రాపురంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటును ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంటు ఎంత ఉపయోగపడుతాయని తెలిపారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిసానతయని తెలిపారు. నేటి యువత మొబైల్స్‌కు పరిమితం అవుతున్నారని తెలిపారు. క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించి స్నేహభావంతో పాల్గొనాలని సూచించారు. నిర్వాహకులు, క్రీడాకారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చట్టం ఎవరికి చుట్టం?

: బోర్డు లేని ఫ్యాక్టరీకి ప్రభుత్వ అనుమతులు ఎలా? : విడవలూరులో మిస్టరీగా మారిన పరిశ్రమ : అన్నారెడ్డిపాలెం గ్రామస్థుల నిరసన అధికారుల మౌనంపై తీవ్ర చర్చ





**విడవలూరు, జూన్ 28 ప్రభాతవార్త:** నిబంధనల ప్రకారం ఒక చిన్న షాపు ఏర్పాటు చేయాలన్నా ముందస్తు అనుమతులు, పేరు బోర్డు తప్పనిసరి. కానీ విడవలూరు మండలం అన్నారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో గత పదేళ్లుగా ఎలాంటి బోర్డు లేకుండానే ఒక ఫ్యాక్టరీ అజ్ఞాతంగా నడుస్తుండటం స్థానికంగా సంచలనంగా మారింది. కనీసం బయట సంస్థ పేరు కూడా లేకపోవడంతో ఆ ప్రాంగణంలో ఏ రకమైన కార్యకలాపాలు సాగుతున్నాయనే దానిపై గ్రామస్థుల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి

- గత పదేళ్లుగా పరిశ్రమ కొనసాగుతున్నా సంబంధిత శాఖల అధికారులు ఇప్పటివరకు పట్టించుకోకపోవడం వెనుక పెద్ద తతంగమే ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, బోర్డు లేని ఈ ఫ్యాక్టరీపై చర్యలు లేకపోవడంపై స్థానికులు ప్రశ్నలు సంధిస్తున్నారు.
- గ్రామ పంచాయతీ రికార్డుల్లో ఈ పరిశ్రమ ఏ పేరుతో నమోదైందనే అంశం కూడా సందేహాలకు తావిస్తోంది. పంచాయతీకి పన్నులు ఏ ప్రాతిపదికన చెల్లిస్తున్నది? పంచాయతీ ఆదాయం ఎటుపోతోంది? అనే ప్రశ్నలకు అధికారుల వద్ద స్పష్టమైన సమాధానం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.
- ఫ్యాక్టరీలో అసలు ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయి? కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటిస్తున్నారా? కార్మికుల భద్రతా ప్రమాణాలు అమలులో ఉన్నాయా? వంటి అంశాలు ఇప్పటికీ రహస్యంగానే ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.
- సమగ్ర విచారణకు డిమాండ్ నిబంధనలను గాలికొదిలేసి, అధికారుల కన్నుగప్పి నడుస్తున్న ఈ గోప్య ఫ్యాక్టరీపై జిల్లా అధికారులు, పారిశ్రామిక శాఖ అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఫ్యాక్టరీకి సంబంధించిన అన్ని అనుమతులు, రికార్డులు, కాలుష్య నియంత్రణ నిబంధనల అమలు, పన్నుల చెల్లింపులపై విచారణ జరిపి, అక్రమాలు తేలితే యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- చట్టం సామాన్యుడికి మాత్రమేనా? ఇన్నాళ్లు ఈ ఫ్యాక్టరీకి అండగా నిలుస్తున్న శక్తులెవరు?" అని స్థానికులు సంధిస్తున్న ప్రశ్నలకు అధికారులు ఎప్పుడు సమాధానం చెబుతారో వేచి చూడాల్సి ఉంది.

# నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ

- మీ కోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం - జిల్లా కలెక్టర్ హిమాన్ష శుక్ల



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త – కలెక్టరేట్** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్ష శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ మీకోసం.ఏపి.జివోవి.ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చును. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# నెల్లూరు జెడ్పీ ఆవరణలో రూ.1.50 కోట్లతో నూతన గెస్ట్ హౌస్

- పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త – కలెక్టరేట్** నెల్లూరు నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీ) కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించ తలపెట్టిన గెస్ట్ హౌస్ (అతిథి గృహం) నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ నిర్మాణ పనులకు రూ.1.50 కోట్ల రూపాయలు) అంచనా వ్యయంతో పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఆదివారం జీవో నెంబర్ 592 జారీ చేశారు. జిల్లా ప్రజా పరిషత్ సాధారణ నిధులలోని ఆస్తుల నిర్వహణ పద్దు కింద ఈ నిధులను కేటాయించనున్నారు. ఈ నూతన అతిథి గృహ నిర్మాణానికి సంబంధించి తదుపరి అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని తాడేపల్లిలోని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. జెడ్పీ ఆవరణలో అత్యాధునిక వసతులతో ఈ గెస్ట్ హౌస్‌ను నిర్మించనున్నారు.

## జిపిఎల్ క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే



**అల్లూరు, జూన్ 28 ప్రభాతవార్త :** అలూరు గౌడౌన్స్ వద్ద జరిగిన జిపిఎల్ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి అల్లూరు క్రికెట్ టీమ్‌కు ట్రోఫీను రూ.50వేలు నగదు బహుమతి, రెండవ బహుమతి జిపిఎల్‌ఏ టీమ్‌కు ట్రోఫీ, రూ.30వేలు నగదు, మూడవ బహుమతి తుమమలపెంట టీమ్‌కు ట్రోఫీ, రూ.20వేలు నగదు, నాలుగోబహుమతి పవన్‌యాదవ్ టీమ్‌కు ట్రోఫి రూ.10వేలు నగదు, ఐదో బహుమతి అల్లూరి జిపిఎల్ టీమ్‌కు ట్రోపి రూ.5వేలు నగదును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ క్రీడలు యువకుల్లో మనోదైర్యాన్ని కల్పిస్తాయని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని దైర్యంగా ఉండేందుకు యువతకు క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. అదే విధంగా క్రికెట్ పోటీలు ప్రారంభానికి మరియు బహుమతులు అందజేసినందుకు ప్రత్యేకగా నన్ను ఆహ్వానించినందుకు గోడౌన్స్ ప్రీమియర్ లీగ్ నిర్వాహకులను అభినందించారు.

## మా దారి ఆక్రమించి మాపైనే దౌర్జన్యానికి దిగుతున్నారు

### అధికారులు న్యాయం చేయలంటు వృద్దుడు వినతి



**బుచ్చి జూన్ 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు గ్రామంలో గత 70 ఏళ్ళ నుండి ఉంటున్న తమ స్దలం వద్ద పక్క నివాసానికి చెందిన సుదాకర్, సుమంత్ కుటుంబసభ్యులు దారి కావాలని దౌర్జన్యం చేస్తున్నారని వృద్దుడు తుపాకుల సుబ్బయ్య విలేఖర్ల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వారికి దారి లేకుంటే మాస్దలంలోనే దారి చామన్నారు. కానీ తమ స్దలంలో ఇంకా దారి కావలని మాపై దౌరన్యానకి దిగుతున్నారని వృద్దుడు ఆవేదన వ్యక్తం చేశారు. 70 ఏళ్ళ నుండి నివాసం ఉంటున్నామని దానికి సంబందించిన రిజిష్టర్ డాక్యుమెంట్లు సర్వేలు,స్దలానికి సంబందించిన అన్ని డాక్యుమెంట్లు ఆయన విలేఖర్లకు చూపించారు. వృతిరిత్యా తమ కుమారుడు బయట ఉంటున్నాడని తమ కుమారుడ్ని సైతం ఇబ్బంది పెట్టేందుకు చూస్తున్నారని అన్నారు. నేను ఇష్టంగా పెంచుకున్న వేపచెట్టును సైతం నాకు తెలియకుండా దౌర్జన్యంగా కొట్టివేశారని వృద్దుడు వాపోయారు. అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేసి దౌర్జన్యానికి పాలుపడుతున్న వారిపైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

## ఎస్సీ కాలనీ రైతుల 30 ఏళ్ల కల సాకారం

**- త్వరలోనే చేపల చెరువుకు బాట నిర్మాణం**
**- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం**
**- ఇరిగేషన్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించి హామీ ఇచ్చిన టీడీపీ సీనియర్ నాయకుడు కోడూరు కమలాకర్ రెడ్డి**



**ఇందుకూరుపేట, జూన్ 28, ప్రభాతవార్త** మండల పరిధిలోని నిడుముసలి గ్రామంలో గత 30 సంవత్సరాలుగా నెలకొన్న ఎస్సీ కాలనీ రైతుల ప్రధాన సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. కాలనీకి చెందిన రైతులు చేపల చెరువుకు వెళ్లేందుకు సరైన బాట (రహదారి) లేక మూడు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించిన కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి సూచనల మేరకు, టీడీపీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి ఆదివారం ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించారు. సమస్య ఉన్న స్థలాన్ని ఆయన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, ఆయన ఆదేశాల మేరకు అధికారుల సమక్షంలో త్వరలోనే ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన బాట నిర్మిస్తామని రైతులకు బలమైన హామీ ఇచ్చారు. 30 ఏళ్ల నాటి సమస్య పరిష్కారం కానుండటంతో ఎస్సీ కాలనీకి చెందిన రైతులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటరీ అధ్యక్షులు చెంచు కిషోర్ బాబు, నిడుముసలి సొసైటీ చైర్మన్ చిరమన వినీల్ రెడ్డి, టీడీపీ మాజీ సర్పంచ్ ఎల్లు నాగరాజు, ఇరిగేషన్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో జిల్లాలో 95.05 శాతం పూర్తి



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త - వైద్యం** నెల్లూరు జిల్లాలో పల్స్ పోలియో దిగ్విజయంగా నిర్వహించినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి. సుజాత తెలియజేశారు. పల్స్ పోలియో కార్యక్రమం మొదటి రోజు ఆదివారం జిల్లాలో గుర్తించిన 2,67,750 మంది 5 సంవత్సరాలలోపు పిల్లలకు గాను 2,54,510 పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు, 95.05 శాతం ప్రగతి సాధించినట్లుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ వి. సుజాత తెలియజేస్తున్నారు. ఏ కారణం చేతైనా మొదటి రోజు పోలియో చుక్కలు వేయించుకొని ఐదు సంవత్సరంలోపు పిల్లల తల్లిదండ్రులు రేపు అనగా 29వ తారీకు, 30వ తారీకు మీ ఇంటింటికి వైద్య ఆరోగ్య సిబ్బంది సందర్శించినప్పుడు మీ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్క వైద్య ఆరోగ్య అధికారి, సిబ్బందిని, దీనికి సహకరించిన ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. సుజాత ధన్యవాదాలు తెలియజేశారు.

## ఇంటింటికి ఓటరు జాబితా సవరణ: తహశిల్దార్



**రాపూరు, జూన్ 28, ప్రభాతవార్త** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట వ్యాప్తంగా చేపట్టిన ఇంటింటికి ఓటరు జాబితా సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కి ప్రజలు సహకరించాలని రాపూరు తహశిల్దార్ లక్ష్మీనరసింహం కోరారు.జూన్ 15 నుండి జూలై 14 వరకు కార్యక్రమం కొనసా గుతుందని ఆయన తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 122 వెంకటగిరి నియోజకవర్గం పరిధి లోని రాపూరు మండలంలో వున్న 51 పోలింగ్ కేంద్రాలలో బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు)ఇంటింటికి వెల్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఓటరు తమ ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి, ఒక పాస్‌పోర్టు సైజు ఫోటోతో పాటు ఆధార్ కార్డు జెరాక్స్ ప్రతిని జతచేసి సంబంధిత బీఎల్ఓలకు గడువులోగా అందజేయాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్న తహశిల్దార్ పి.లక్ష్మీ నరసింహం మండల ప్రజలందరూ బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించి గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

## పిల్లల ఆలనా పాలనా తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదు

### తెదేపా మైనార్టీసెల్ అధ్యక్షులు మస్తాన్ భాష



**కోట,జూన్ 28 ప్రభాతవార్త** పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వా మ్యం కావాలని కోట మండల తెదేపా మైనార్టీసెల్ అధ్యక్షులు షెక్.మస్తాన్ భాష కోరారు.ఆదివారం మండల పరిధిలోని చంద్రశేఖపురంలో గ్రామం లో ఆయన చిన్నారులకు పోలియో చుక్కలును వేశారు. మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు.చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టికాలను నిర్ణీత సమయానికి తప్పనిసరిగా వేయిచాలని సూచించారు ఇంట్లో భర్త మగవాళ్లు కూడా ఈ విషయంలో బాధ్యత తీసుకోవాలన్నారు. పిల్లన్ని కని పెంచడం వారి ఆలనా పాలనా చూసుకోవడం తల్లికి మాత్రమే పరిమితం చేయకూడదన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబాల ఉంటే పిల్లలు పెంపకంలో భాగస్వామ్యలు అయ్యేవారని చెప్పారు. పిల్లలను విలువలతో పెంచడలో నాడు అమ్మమ్మలు, తాతయ్యలు ఇతర కుటుంబ సభ్యులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషంచేవారనని మస్తాన్‌భాష గుర్తు చేశారు.ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదన్నారు. అలాంటి వ్యవస్థ మళ్లీ రావాని మస్తాన్‌భాష ఆకాక్షించారు. సంతానం అంటే సం పద అనే పరిస్దితి వస్తోందన్నారు. అందుకే ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండేలా ప్రభుత్వం పరంగా కూడా ప్రోత్స హిస్తుందన్నారు.ఈ ఎఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై బిజెపి అసెంబ్లీ స్థాయి అవగాహన సమావేశం



**కావలి, జూన్ 28 ప్రభాతవార్త :** భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో కావలి అసెంబ్లీ నియోజకవర్గ స్తాయి స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(ఎస్ఐఆర్)పై అవగాహన సమావేశం ఆదివారం ఘనంగానిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ఓటరు జాబితా శుద్దీకరణలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు కావడంతో పాటు, తప్పులను సరిద్దుడం, అనర్హుల పేర్లు తొలగింపు వంటి ప్రక్రియలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఎస్ఐఆర్ ఎంతో ముఖ్యమని వివరించారు. పార్టీ నియమించిన బిఎల్ఏ-2లు ప్రభుత్వం నియమించిన బిఎల్ఓలతో సమన్వయంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్ పరిదిలో ఇంటింటికి వెళ్ళి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ అవసరమైన వారికి సహకారం అందించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచిచారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్, అంచిపాక కమల, కావలి డివిజన్ జనతా వారధి ఇన్‌చార్జ్ కుట్టుబోయిన బ్రహ్మానందం, మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వింత రంగారెడ్డి, జీఎస్‌టి మండలి సభ్యులు అమరా వెంకటసుబ్బారావు, ఎస్‌సి మోర్చా మాజీ ఉపాధ్యక్షులు పరుసు వెంకటేశ్వర్లు, బిజెపి కావలి 1వ, 2వ పట్టణ అధ్యక్షులు మంద కిరణ్‌కుమార్, లక్కరాజు భాస్కర్, బోగోలు మండల అధ్యక్షులు వీరాల శ్రీనివాసులు యాదవ్, తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి




**కావలి, జూన్ 28 ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి జులై 7న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యఓఉలు దామ అంకయ్య తెలిపారు. నియోజకవర్గ ఏఐటియుసి 5మహాసభను సిపిఐ కార్యాలయంలో ఆదివారం రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి అంకయ్య ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ బకాయిలను ఇవ్వలేని ప్రభుత్వం 12వ పిఆర్‌సి ప్రకటించాలంటే జంకే ప్రభుత్వం, నిర్దిష్టమైన నిధులు కేటాయించకుండా విశాఖ ఉక్కు ప్యాక్టరీలో కార్మికుల మరణానికి కారణమైందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు నల్ల లేబర్ కోడులకు మద్దతి ఇచ్చి రాష్ట్రంలో కార్మికుల పనిభద్రత ప్రశ్నార్ధకం చేసిన సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో వేతనాలు పెంపు సవరణలకు కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మెప్మాఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్‌చేశారు. నియోజకవర్గంలో 17వ కార్యవర్గం 9మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా చెవురు చిట్టిబాబు, పాముల శ్రీనవాసులు ఉపాధ్యక్షులుగా రవి, సాయిలను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కావలిలో ఘనంగా ర్యాంకర్స్‌డే మహోత్సవం



**కావలి, జూన్ 28 ప్రభాతవార్త :** కావలి ఇండియన్ మెడికల్ ఆసోసియేషన్ జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రవి నర్సింగ్‌హమ్‌నందు అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన ర్యాంకర్స్‌డే మహోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో కావలి ప్రభుత్వ పాఠశాలల విభాగంలో 8వ వార్డు మున్సిపల్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థి సయ్యద్ రోష్ని 590, 4వ వార్డు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి రీతూ ప్రియారెడ్డి 590 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ నిలిచారు. పట్టణంలోని ప్రైవేటు స్కూల్ విభాగంలో పాత ఊరు శ్రీ చైతన్య ఇంగ్లీష్‌మీడియం స్కూల్ విద్యార్థి బి.శరణ్య 597, ఐఎఎస్ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్ విద్యార్థి కె.అక్షజ్ 595 మార్కులతో పట్టణంలో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచారు. హాస్టల్ రెసిడెన్షియల్‌స్కూల్ విభాగంలో ఏపీడబ్ల్యుఆర్ఎస్ నుంచి వావిళ్ళ వెంకట కిషోర్ 570, ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహ విద్యార్థి పి.లావణ్య 562 మార్కులతో మొదటి, రెండవ స్థానంలో నిలిచారు. ఇంటర్ ఎంపిసి గ్రూపులో శ్రీ మేధా జూనియర్ కళాశాల విద్యార్థి డి.మాలతి 990, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఎం.దివ్యవాణి 990, ఆర్.లక్ష్మి సుహిత 990, శ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.చందన 990 మార్కులతో టౌన్ పస్ట్‌గా, శ్రీ వశిష్ట జూనియర్ కలాశాల విద్యార్థులు బి.జ్ఞానేశ్వరి 988,బైపిసిలో శ్రీవాణి 971, సిఈసిలోలో టౌన్‌పస్ట్‌గా నిలిచారు. ఈసందర్భంగాప పట్టణ జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, ఐఎంఏ కోశాదికారి డాక్టర్ వెంకటేష్,ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ శ్రీరామ్ మనోహర్‌బాబు, డాక్టర్ అల్లం శ్రీనివాసులు, పి.శివప్రసాద్ చేతుల మీదుగా నగదు బహుమతులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక బాధునయులు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అన్నదానం చేసిన పుట్టుపల్లి కుటుంభీకులు



**బుచ్చి జూన్ 28 ప్రభాతవార్త** మొహరం సందర్బంగా బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని నాగమాంబాపురం మౌలాలి స్వామి పీర్ల చావిడి వద్ద షేక్ సాబ్‌జాన్ ఆధ్వర్యంలో పుట్టుపల్లి కుటుంబీకులు పెద్దఎత్తున అన్నదాన వితరణ చేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతు అన్ని దానాలకంటే అన్నదానం మహాదానమన్నారు. పాడిపంటలు బాగా పండి రైతులు ఆనందంగా ఉండాలని మౌలిలిస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. ఇక నుండి ప్రతి ఏటా అన్నదానం చేయాలను కుంటున్నామన్నారు. ఈకార్యక్రమంలో మొహరం యూత్ షారుఖాన్, జలీల్, హజరత్, జాకీర్, నూర్ అహ్మద్, బాదుల్లా, మతీన్, హనీఫ్, తదితరులున్నారు.

## గిరిజన మహిళపై దాడిచేసిన వారిని శిక్షించాలి

### వైసిపి పట్టణ మహిళలు



**కావలి, జూన్ 28 ప్రభాతవార్త :** గిరిజన మహిళపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కావలి పట్టణ వైసిపి మహిళలు తెలిపారు. కావటి పట్టణ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కచేరిమిట్టకు చెందిన పీట సుకుమారి గిరిజన మహిళపై కొన్ని రోజుల క్రితం ఆదే ప్రాంతానికి చెందిన పలువురు విచక్షణా రహితంగా దాడిచేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఆమె గృహానికి పట్టణ మహిళలు వెళ్లిపరామర్శించి దైర్యం చెప్పి మీము అండగా ఉంటామని తెలిపారు. వైసిపి నాయకురాళ్ళు వెంగలశెట్టి కల్యాణి, పందిటి సుమలత, నందనవనం సీతాలక్ష్మి, చలంచర్ల పద్మ, దామెర్ల నాగేశ్వరమ్మలు మాట్లాడుతూ పీట సుకుమారిపై దాడిని వైసిపి పార్టీతీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఓ మహిళపై విచక్షణా రహితంగా దాడి జరిగితే పోలీసులు కూడా చూసిచూడనట్లు వ్యవహరించడం అన్యాయమని తెలిపారు. కావలిలో అక్రమాలు పెట్రేగిపోతున్నాయన్నారు. పట్టణంలో మహిళలు నివసించాలంటే భయాందోళనలకు గురికావల్సి వస్తొందన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైసిపి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ ఆకార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమా ర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు పందిటి కామరాజు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాపూరు మండలంలో పల్స్‌పోలియోకు విశేష స్పందన




**రావూరురాపూరు, జూన్ 28, ప్రభాతవార్త** జాతియ పల్స్ పోలియో కార్యక్రమానికి రాపూరు మండలంలో విశేష స్పందన లభించింది. ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్ర మంలో 4,386 మందికి చుక్కలు లక్ష్యం కాగా 4,230 మంది చిన్నా రులకు పోలియో చుక్కలు వేసినట్లు వేపినాపి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వై ద్యాధికారి డాక్టర్ ప్రమీలా రాజకుమారి తెలి పారు.మిగిలిన చిన్నారులకుసోమవారం, మంగళ వారం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెల్లి పోలి యో చుక్కలు వేయడం ద్వారా వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. వలస, వ్యవసాయ కూలీల పిల్లలు, హైరిస్క్ ప్రాంతాల్లోచిన్నారులను గుర్తించి మొబైల్ వైద్య బృందం ద్వారా పోలియో చుక్కలు వేయడంతో పాటు, ప్రయాణికుల పిల్లల కోసం రాపూరు ఆర్టీసి బస్టాండ్‌లో ప్రత్యేక పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.వైద్యులు డాక్టర్ భాను, డాక్టర్ సుదర్శనమ్మ, డాక్టర్ సూర్య ధర్మేంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ పోలు కిశోర్ కుమార్, పలువురు ఆరోగ్య సిబ్బంది,అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గోన్నారు.

## భక్తుల రద్దీ దృష్ట్యా రొట్టెల పండుగకు ప్రత్యేక భద్రత..

**- బందోబస్తుపై సమీక్షించిన జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల**





**నెల్లూరు క్రైమ్, జూన్ 28, ప్రభాతవార్త:** ప్రాధాన్యత కలిగిన బారా షహీద్ దర్గా రొట్టెల పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల దర్గా ప్రాంగణాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా దర్గా పరిసర ప్రాంతాలు, భక్తుల రాకపోకలు, క్యూ లైన్లు, ఘాట్ ఏరియా, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పరిశీలించారు. అనంతరం పోలీస్ కంట్రోల్ రూమ్ నుండి బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించి, విధుల్లో ఉన్న అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. గంధం అనంతరం, భక్తుల రద్దీ క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, క్యూ లైన్లలో క్రమబద్ధమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, తప్పిపోయిన చిన్నారులు, వ్యక్తుల విషయంలో తక్షణ స్పందనతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్‌అంతరాయం లేకుండావా హనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని, పార్కింగ్ ప్రాంతాల్లో పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని సూచించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ నుండి సీసీ కెమెరాలు, డ్రోన్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా నిరంతరం పరిస్థితులను గమనిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కపోలీస్ అధికారి, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం లేకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.

## బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ మూడో రోజు విశేషాలు



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త - కలెక్టరేట్** నెల్లూరు బారాషహీద్ దర్గాలో జరుగుతున్న 5 రోజుల రొట్టెల పండుగలో మూడో రోజు గంధ మహోత్సవం ప్రధానఆకర్షణ. 2026 జూన్ 27, శనివారం రాత్రి ఈ ఉత్సవం వైభవంగా జరిగింది. మూడో రోజు గంధ మహోత్సవం కోటమిట్ట అమీనియా మసీదు నుంచి 12 బిందెల గంధాన్ని పూల రథంలో మేళతాళాలతో ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. దర్గాలోని మసీదులో 12 గంధం బిందెల కు ముజావర్లు, ఫకీర్లు పూజలు చేసి, బారాషహీద్‌లైన 12 మంది అమరవీరుల సమాధులకు కడప పెద్ద మసీదు పీఠాధిపతి ఆరీఫుల్లా హుసేనీ గంధం లేపనం చేశారు. అనంతరం భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు.

**- భక్తుల రద్దీ..** రెండో రోజు నుంచే స్వర్ణాల చెరువు తీరం భక్తులతో పులకించింది. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా లక్షలాది మంది తరలివచ్చారు. మొదటి రోజు 3 లక్షల మంది రాగా, ఆదివారం నాటికి 67 లక్షలకు చేరుతుందని అంచనా.

- రొట్టెల మార్పిడి : కోరిన కోర్కెలు తీర్చే వరాల రొట్టె కోసం భక్తులు పోటీపడ్డారు. స్వర్ణాల చెరువులో స్నానం చేసి, దర్గాలోని 12 మంది వీరుల సమాధులను దర్శించుకుని రొట్టెలు మార్చుకున్నారు. సంతానం కోరేవారు సంతాన రొట్టె, ఉద్యోగం, ఇల్లు, ఆరోగ్యం కోసం వేర్వేరు రొట్టెలు మార్చుకోవడం విశేషం.

**- ఏర్పాట్లు :** మంత్రి పొంగూరు నారాయణ లంగరుఖానా ప్రారంభించి భక్తులకు వడ్డించారు. భద్రత కోసం 1,743 మంది పోలీసులు, 26 డ్రోన్లు, 96 దిదిగిజు కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. 4 నైట్‌విజన్ డ్రోన్లను కూడా ప్రారంభించారు. 6,000+ పారిశుధ్య కార్మికులు, 45 మంది నిపుణులైన ఈతగాళ్లు, 15 పడవలు, 125 మంది అగ్నిమాపక సిబ్బంది విధుల్లో ఉన్నారు.

**- పండుగ షెడ్యూల్ :** 1వ రోజు : సొందల్/సందల్ మాలి ఊరేగింపు, 2వ రోజు : గంధ మహోత్సవం, 3వ రోజు : రొట్టెల పండుగ అసలైన రొట్టెల మార్పిడి, 4వ రోజు : తహలీల్ ఫాతహాజ, 5వ రోజు : ముగింపు ఉత్సవం

## భారీ విద్య రొట్టె పట్టిన అబ్దుల్ అజీజ్

**- పేద విద్యార్థులకు ఉచిత విద్య అందాలని కోరుకుంటూ రొట్టె వదిలిన విద్యార్థులు**
**- తమలాగే అనేక మందికి ఉచిత విద్య అందాలని కోరుకుని అబ్దుల్ అజీజ్‌కు రొట్టె అందించిన విద్యార్థులు**



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త - వైద్యం** ఏపీ వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో తాలిం ఏ హునర్ పేరుతో ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించి 250 మంది పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ రెసిడెన్షియల్ విద్య అందిస్తున్న సంగతి అందరికి తెలిసిందే. ట్యాలెంట్ టెస్ట్ లో ఉత్తీర్ణులైన విద్యార్థులు తమలాగే ఎంతో మందికి ఉచిత కార్పొరేట్ విద్య అందాలని కోరుకుంటూ రొట్టె వదిలారు. ఆ రొట్టెను ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అందుకున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ గత సంవత్సరానికి మించి ఈ సంవత్సరం 20 లక్షల మంది భక్తులు విచ్చేశారని, వారికి సౌకర్యాలు కల్పన సరిగా జరిగిందా లేదా అన్న ఆందోళన ఉందన్నారు. పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య అందించాలన్న లక్ష్యంతో తాలీం ఏ హునర్ పేరుతో ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించి, కార్పొరేట్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరింత మందికి విద్య అందించాలని కోరుకుంటూ విద్య రొట్టె పట్టుకున్నామని అన్నారు. విద్య రొట్టెను అందరికీ పంచిపెట్టామని అన్నారు. ఇదే విద్యార్థులను డాక్టర్‌లుగా ఇంజినీర్‌లుగా చేసి తీసుకువస్తానని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు లోకేష్, ఫరూక్‌ల ఆశీర్వాదంతో కార్యక్రమం విజయవంతం అయిందని అన్నారు. విద్యార్థి అంజుం మాట్లాడుతూ పరీక్షలో సెలెక్ట్ అయ్యి నేను కార్పొరేట్ కళాశాలలో చదువుతున్నాను. అక్కడ చదవాలంటే అదృష్టం ఉండాలని, అంతటి అదృష్టం ప్రసాదించిన ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు లోకేష్, ఫరూక్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, కరిముల్లా, సమీ హుస్సేనీ, సాబీర్ ఖాన్, హయత్ బాబా, ఇంతియాజ్, పాషా మొహిద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



**గూడూరు, జూన్ 28, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలోని స్థానిక రాజా వీధిలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారు తిరుచి ఉత్సవం పై పట్టణంలో ఊరేగారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహ న్రావు, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు. ఉభయ దాతలుగా రాధా రాణి జ్ఞాపకార్థం గొట్టిపాలు రామసుబ్బారెడ్డి వివరించారు. దంపతులు వ్యవహరించారు. పూజ కార్యకర్మల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్. ప్రభాకర్ ఇక లేరు



చిల్లకూరు, జూన్ 28, ప్రభాతవార్త: వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సిపిఐ నెల్లూరు జిల్లా మాజీ కార్యదర్శి చీపినేటి ప్రభాకర్ ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధికి చికిత్స పొందుతూ నెల్లూరు నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం, కొద్ది సేపటి క్రితం తుది శ్వాస విడిచారు.

## నేడు కొడవలూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**కొడవలూరు, జూన్ 28 ప్రభాతవార్త:** మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నేడు తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ వేదికను వేదికగా ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ పరమైన సమస్యలు, భూ వివాదాలు, రేషన్ కార్డులు, పింఛన్ల పంపిణీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల వంటి అంశాలపై వచ్చే అర్జీలను పరిశీలించి, అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి హాజరయ్యే ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన రాతపూర్వక వినతిపత్రాలతో పాటు, అందుకు సంబంధించిన ఆధారాలను వెంట తీసుకురావాలని తహశీల్దార్ కోరారు. ప్రభుత్వ పరమైన సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.

## పోలియో చుక్కలు వేసిన సూపర్‌వైజర్



**బుచ్చి జూన్ 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసి డిఎస్ సూపర్ వైజర్ నాగభూషణమ్మ చిన్నారులకు పోలియో చుక్కలువేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతుప్రతి బిడ్డకు తప్పకుండా పోలియో చు క్కలు వేయించాలని, పోలియో రహిత సమాజం మన అందరి ధ్యేయం అని ఆమె పేర్కున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరా విజయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతీ, ఎఎన్ఎం రత్నావళి, అంగన్ వాడీ కార్యకర్త ఎం మస్తానమ్మ, ఆశావర్కర్ పి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్‌చే కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సహాయం



**గూడూరు, జూన్ 28, ప్రభాతవార్త** గూడూరు రెండో పట్టణంలో నివాసం ఉంటున్న నాగిశెట్టి హరిబాబు రెండు సంవత్సరాల క్రితం కిడ్నీ వ్యాధితో బాధప డుతూ మన్నించాడు. అప్పటి నుండి వారి బాగోగులు చూసుకుంటూ ఉన్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీని వాసులు నాయుడు ప్రతిసంవత్సరంఅలాగే ఈ సంవత్సరం కూడా హరిబాబు కుమార్తె చదువు కోసం పది వేలరూపాయలను ట్రస్ట్ సభ్యుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బాబు, ప్రజేంద్ర రెడ్డి, కృష్ణారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు





**కోట, జూన్ 28 ప్రభాతవార్త** చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కల అవసరమని కోట పట్టణ ఎంపిటిసీలు, షంషద్దీన్, సురేష్‌లు అన్నారు. ఆదివారం కోటలో వారు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు పల్స్ పోలియోచుక్కలు వేయించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతక ముందు చిట్టేడు గ్రామంలో డాక్టర్, నాగరాజు ఆధ్వర్యంలో చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు చుక్కలు పోలియో వ్యాక్సిన్ వేయించడం ద్వారా భారత దేశాన్ని పోలియో రహిత దేశంగా తయారు చేయగలమని పెర్కొన్నారు. ప్రతి సంవత్సరం రెండు సార్లు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. మొదటి రోజు పోలియో చుక్కలు వేసుకోలేని పిల్లలకు సోమ, మంగళవారాల్లో ఇంటి వద్దకే వచ్చి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. పోలియో వ్యాక్సిన్ వేయించడం దారా వైరస్ నుంచి పూర్తి రక్షణ కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 75 శాతం వరకు విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త – అగ్రికల్చర్** నెల్లూరు రూరల్ మండలం కొమ్మరపూడిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో ఆదివారం సాయంత్రం వరకు 75 శాతం పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మిగిలిన 25 శాతం పిల్లలకు రెండు రోజుల పాటు ఇంటి వద్దకే వెళ్లి పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేశామని అంగన్వాడి, ఆశా వర్కర్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో పల్స్ పోలియో కార్యక్రమం పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండల స్థాయిలో అధికారులు ఎవరు పరిశీలించకపోవడం గమనార్హం.

## పెన్నా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**నెల్లూరు క్రైమ్, జూన్ 28, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలోని పెన్నా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన ఘటన కలకలం రేపింది. పాత బస్సు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద 3వ పిల్లర్ వద్ద ఈరోజు 45 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు వ్యక్తి మృతదేహం కనిపించింది. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతుడు బ్లూ జీన్స్, నలుపు, తెలుపు రంగులు కలిగిన గళ్ళ పొడుగు చేతుల రెడీమేడ్ చొక్కా, చొక్కాపై 23 అనే నెంబరు ఉందని, మృతుని కుడి చేతిపై అమ్మ అనే పచ్చబొట్టు, మెడలో ఎరుపు రంగు తాయత్తుకట్టిన దారం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై నవాబ్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడిని గుర్తించినవారు లేదా అతని ఆచూకీ గురించి ఏమైనా సమాచారం ఉన్నవారు 9440796306 నెంబర్‌కు వెంటనే సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## సూరాయిపాలెం పోలియో కేంద్రంను సందర్శించిన వైద్యాధికారి డా. వి. నరసింహారావు



**పొదలకూరు, జూన్ 28, ప్రభాతవార్త** పొదలకూరు మండలంలో మొదటి రోజు పోలియో చుక్కలను బూత్‌లల్లో వేయడం జరిగింది. మొదటి రోజు వేయించుకొనని 93 మంది పిల్లలకి రెండవ రోజు ఇంటికి వచ్చి వేయడం జరుగుతుంది. కనుక ప్రజలందరూ పోలియో రహిత సమాజం కొరకు పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కొరకు మీ అందరూ సహకరించాల్సిందిగా ఈ కార్యక్రమాన్ని డాక్టర్. వి. నరసిం హారావు, డాక్టర్ కిరణ్ రిషిత, డాక్టర్ కావ్య పర్యవేక్షించారు. అర్హులైన పిల్లలు 7614 మందికి గాను మొదటి రోజు పల్స్ పోలియో చుక్కలు వేయించుకున్న 7521 పిల్లలకు 98.77 శాతం నమోదైంది. పొదలకూరు బస్టాండ్ ట్రాన్సిట్ బూత్‌లో 158 మంది పిల్లలు పోలియో చుక్కలు వేయించుకున్నారు.

## పల్స్ పోలియో చుక్కలు వేసిన నాగలవరం సొసైటీ అధ్యక్షుడు



**బిట్రగుంట జూన్ 28 ప్రభాతవార్త** బోగోలు మండలంలోని మేజర్ పంచాయతీలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో నాగలవరం సొసైటీ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు పాల్గొని చిన్నా రులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాన్ని పోలియో రహితంగా ఉంచేందుకు ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావడానికి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన అభినందించారు. గ్రామంలోని చిన్నారులందరికీ పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోలియో చుక్కలు వేసిన ఏఎంసి డైరెక్టర్



**బిట్రగుంట జూన్ 28 ప్రభాతవార్త**బోగోలు మేజర్ పంచాయతీలో బోగోలు విశ్వనాథరావుపేట గ్రామాల్లో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో కావలి ఏఎంసి డైరెక్టర్ ఎల్ సుధీర్ బాబు మండల టిడిపి కన్వీనర్ ఎం.నాగేశ్వరరావులు పల్స్ పోలియో వైద్య సిబ్బందితో కలిసి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరూ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయిం చుకోవాలని అందుకు వైద్య సిబ్బందికి పిల్లల తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు.

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి : ఎమ్మెల్యే



**వింజమూరు, జూన్ 28, ప్రభాతవార్త** 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం వింజమూరు పంచాయతీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలియో బూత్ వద్ద ఆయన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. చిన్నారి ఆరోగ్యం కోసం, భవిష్యత్తు కోసం ఈ చుక్కలు ఎంతో అవసరమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే స్వయంగా ఒక చిన్నారికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆయన వెంటనే పలు బూతులను సందర్శించి సిబ్బందికి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవతో వింజమూరు మండలంలో నిర్వహించిన బూతు స్థాయి పల్స్ పోలియో కార్యక్రమం 98.58 లక్ష్యాన్ని సాధించింది లక్ష్యం 3738 మంది చిన్నారులకు కాగా, 3685 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మిగిలిన చిన్నారులను సోమవారం ఇంటింటి కార్యక్రమంలో గుర్తించి చుక్కలు వేయనున్నట్లు అధికారులు తెలిపారు. వైద్యాధికారులు డాక్టర్ కె. మురళీధర్, డాక్టర్ ఎల్. సృజన, టీడీపీ మండల నాయకులు గూడ నర్సారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో రామారావు, సీహెచ్ఓ సక్కుబాయమ్మ, ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలియో రహిత భారత్ కోసం చిన్నారులకు పోలియో చుక్కలు వేయిద్దాం



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త – వైద్యం** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రభుత్వంతో పాటు ప్రజలందరూ విజయవంతం చేయాలని ప్రముఖ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ పాలకొల్లు అమర్నాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఉస్మాన్ సాహెబ్ పేటలోని షిరిడి సాయి ప్రథమ చికిత్సాలయంలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కార్యక్రమాన్ని ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేతలతో కలిసి ఆయన ప్రారంభించారు. పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మాట్లాడుతూ పోలియో రహిత భారతదేశం కోసం 0 – 5 సం వత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. ఇది సురక్షితమైనది, నొప్పి లేనిది, ఉచితంగా దొరికేదని అన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బలోపేతం అవుతుందని పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూ లించేందుకు అందరం కంకణ బద్ధులం కావాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ పాలకొల్లు అమర్నాథరెడ్డిని పిఎంపి అసోసియేషన్ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఎంపీ నాయకులు సిహెచ్ వీరయ్య, శాఖవరపు వేణుగోపాల్, నరసాపురం ప్రసాద్, బైరి శంకర్రావు, టిడిపి నేత పత్తి మల్లికార్జున, ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం



**వింజమూరు, జూన్ 28, ప్రభాతవార్త:** పోలియో రహిత భారత నిర్మాణంలో ప్రతితల్లిదండ్రి భాగ స్వామి కావాలని ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షులు, ఏపీ జేఏసీ చైర్మన్ వెలుగోటి మధు పిలుపునిచ్చారు. ఆది వారం వింజమూరులో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 05 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో నివారణ కోసం రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ తప్పనిసరిగా అందించాలని తెలిపారు. ఈ వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై ప్రజలందరూ అవగాహన చేసుకోవాలని, 5 ఏళ్లలోపు పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ సేవను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమ ఉద్దేశం పిల్లలను పోలియో వ్యాధి నుండి రక్షించడం, పోలియో రహిత సమాజ నిర్మాణానికి తోడ్పడటమే అని వెలుగోటి మధు స్పష్టం చేశారు. టౌన్‌లోని అన్ని ముఖ్య కేంద్రాల్లో హెల్త్ సిబ్బంది సహకారంతో పోలియో బూతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు కలిసి ఇంటింటికీ అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వింజమూరు సొసైటీ డైరెక్టర్ గని శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పోలియో చుక్కలు.. చిన్నారుల ఆరోగ్యానికి రక్షణ కవచం



**విడవలూరు, జూన్ 28 ప్రభాతవార్త:** ఐదేళ్లలోపు ప్రతిచిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తహశీల్దార్ ఏ.లక్ష్మి ప్రసన్న పిలుపునిచ్చా రు. మండలంలోని పార్లపల్లి గ్రామ పంచాయతీ కార్యా లయంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై చిన్నారు లకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూ లించాలంటే ప్రభుత్వం నిర్వహించే ప్రతి పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. పోలియో చుక్కలు పూర్తిగా సురక్షితమైనవని, శాశ్వత అంగవైకల్యం నుంచి పిల్లలకు రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి ప్రభుత్వ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నిఖిల్, ప్రభుత్వ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ వేగవంతం చేయాలి



**విడవలూరు, జూన్ 28 ప్రభాతవార్త:** మండలంలోని పార్లపల్లి, విడవలూరు, అలగానిపాడు గ్రామాల్లో ఆదివారం తహశీల్దార్ ఏ.లక్ష్మి ప్రసన్న ప్రత్యేక ఓటర్ల జాబి తా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సం బంధించిన పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టంచేశారు. ఆర్. ఐ. అబ్దుల్ సలాం, సీనియర్ అసిస్టెంట్ సుదీర్, వీఆర్వోలు, బి ఎల్ వో లు పాల్గొన్నారు.

## పోలియో చుక్కలు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, జూన్ 28 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం సందర్భంగా మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలియోను శాశ్వతంగా నిర్మూలించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆదివారం మిస్పైన చిన్నారులకు సోమ, మంగళవారాల్లో కూడా వేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని తల్లులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యమ్రంలో ఎంపీటీసీ సభ్యుడు సునీల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పెంచలయ్య, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుభాన్, బి. శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

## ఆత్మకూరులోని సుల్తాన్‌షాహిద్ దర్గా గంధమహోత్సవం ప్రారంభం



**ఆత్మకూరు ,జూన్28,ప్రభా త వార్త:** ఆత్మకూరు పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సుల్తాన్‌షాహిద్ దర్గా గంధమహోత్సవ వేడుకలు ఆదివారం నుండి ప్రారంభమయ్యాయి. దర్గాలో సొందల్ మాలి కార్యక్రమంతో గంధమహోత్సవ కార్యక్రమం ప్రారంభమైందని నిర్వాహకులుతెలిపారు. ఆదివారం తెల్లవారుజామున గంధమహోత్సవం, మంగళవారం చిరాగా, తహలీల్ ఫాతేహా కార్యక్రమాలతో దర్గాలోని గంధమహోత్సవ వేడుకలు ఘనంగాజరుగుతాయన్నారు. ఈకార్యక్రమంలోభక్తులు భారీగా పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

## ఘనంగా జాతీయ పల్స్ పోలియో



**చేజర్ల, జూన్ 28, ప్రభాతవార్త** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని చేజర్ల మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచిస్తూ అవగాహన కల్పించారు. తూర్పుకంభంపాడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులు నాయుడు, మాజీ సర్పంచ్ కొమ్మి రమేష్‌నాయుడు పాల్గొని పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. చేజర్ల మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీ రావి పెంచల్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బూదల్ల వీర రాఘవరెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు సోమవరపు హజరత్ అయ్యా, బీజేపీ నాయకులు రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ బత్తల కృష్ణయ్య పాల్గొన్నారు. చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేసి కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. కొలపనాయుడుపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు అచ్చాల నారాయణరెడ్డి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం పోలియో వ్యాధి నివారణలో ఈ కార్యక్రమం కీలకమని పేర్కొంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. పెరమళ్ళపాడు గ్రామంలో తెలుగుదేశంపార్టీ మండల ప్రధాన కార్యదర్శి తలపనేని జయంతిలు నాయుడు కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. పుల్లనీళ్లపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు కొమ్మిసిద్దులు నాయుడు పాల్గొని తన చేతుల మీదుగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మడపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొండ సుధాకర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు కుండా శివారెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా కూటమి నాయకులు, ఆరోగ్య శాఖ సిబ్బంది చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారి డాక్టర్ నవీన్‌రెడ్డి పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా అంగవైకల్యానికి దారి తీసే పోలియో వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్యశాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మండలంలోని ప్రతి అర్హ చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆరోగ్యశాఖాధికారులు తెలిపారు.

## చిన్నారుల జీవితాంతం రక్షణగా పోలియో చుక్కలు



**దగదర్తి, జూన్ 28, ప్రభాతవార్త** దగదర్తి పీహెచ్ అనుసంధానమైన 13బూత్‌లలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డాక్టర్ అఖిల తెలిపారు. మండల కేంద్రమైన దగదర్తి పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. 13 బూత్‌లలో 1504 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని, 95శాతం పోలియో నమోదైందని తెలియజేశారు. అప్పుడే పుట్టిన శిశువు నుండి 5 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పల్స్ పోలియో చుక్కలు చిన్నారులకు జీవితాంతం రక్షణ కవచంలా నిలుస్తాయని, చిన్నారుల ఆరోగ్యవంతమైన జీవితానికి, బంగారు భవిష్యత్తుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. నేడు(సోమవారం) ఇంటింటికి తిరిగి ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణనపత్రం డిజిటలైజేషన్ అయిందా?

**కోట, జూన్ 28 ప్రభాతవార్త** జిల్లా వ్యాప్తంగా సర్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. జిల్లాలో బూత్ లెవల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లతో కలిసి ఇంటింటికి తిరిగి గణన పత్రాలను (ఎన్యూమరేషన్) ఓటర్లకు అందజేస్తున్నారు. శనివారం నాటికి కోట మండలంలో 40,192 పత్రాలను పంపిణీ చేశామని తహశీల్దార్ కె.జయజయరావు ప్రకటించారు. ఓటర్లు తాము పూర్తి చేసిన పత్రాలను బిఎల్‌ఓలకు అందిస్తుండగా, వాటిలో 6,285 (14.8 శాతం) మాత్రమే డిజిటలైజేషన్ చేశారు. ఈ ప్రక్రియ పూర్తయినట్లు ఓటరుకు ఏ విధమైన సమాచారం వచ్చే వెసులుబాటు లేదు. తమ ఓటును డిజిటలైజేషన్ చేశారా? లేదా? అని చాలామందికి అనుమానాలు వస్తున్నాయి. ఈ క్రింది విధంగా తెలుసుకునే వీలుందని అధికారులు చెప్తున్నారు.

**సిటిజన్ సర్వీస్ పోర్టల్‌లోకి లాగిన్** మీ ఓటు కార్డుతో చరవాణి నంబర్ అనుసంధానమై ఉండాలి. గూగుల్ లేదా ఏ ఇతర బ్రౌజర్‌లో ఈసిఐనెట్ వారి సిటిజన్ సర్వీస్ పోర్టల్‌లోకి వెళ్లాలి. ఫిల్ ఎన్యూమరేషన్ ఫారం అనేది కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేస్తే లాగిన్ పేజి ఓపెన్ అవుతుంది. దానిలో మీ చరవాణి నంబర్, క్యాప్చా నమోదు చేసి క్లిక్ చేస్తే.. ఓటిపి వస్తుంది. దాన్ని నమోదు చేసి క్లిక్ చేస్తే మరో పేజి ఓపెన్ అవుతుంది. రాష్ట్రం, ఓటరు కార్డు, నంబర్ నమోదు చేసి సెర్చ్ క్లిక్ చేయండి. యువర్ ఫారం హ్యాజ్ ఆల్‌రెడీ బీయింగ్ సబ్‌మిటెడ్ అని వస్తే మీ ఓటు డిజిటలైజేషన్ అయినట్లే. అలా కాకుండా మీ పేరుతో వివరాలు కనిపిస్తే ఇంకా డిజిటలైజేషన్ కానట్లే. జూలై 14వ తేదీ వరకు సమయం ఉంది. కాబట్టి మరికొద్ది రోజులు వేచి చూడండి. ఇంకా పూర్తి కాకపోతే మీకు ఇచ్చిన ఫారం పైనే బిఎల్ఓ పేరు, చరవాణి నంబర్ ఉంటుంది. వారికి ఫోన్ చేసి వివరాలు కనుక్కోవచ్చు.

## చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి - బొల్లినేని వెంకట రామారావు



**ఉదయగిరి, జూన్ 28, ప్రభాతవార్త** పట్టణంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు పాల్గొని ఐదేళ్లలోపుచిన్నారులకు పోలియోచుక్కలు వేశా రు. ఆయన మాట్లాడుతూ పోలియో రహి త సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి తమ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చెంచల్‌బాబు యాదవ్, టీడీపీ యువనేత బొల్లినేని కార్తీక్, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు రియాజ్, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రావణ సేవ అలంకారంలో ఆది శంకరుడు



**కోవూరు, జూన్ 28 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బ్రహ్మో త్సవాల్లో భాగంగా ఆదివారం ప్రాత :కాలమునే స్వామివారికి ఆలయ ప్ర ధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరంరావణ సేవ అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శ నమిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా బలిజ సం ఘం వారు వ్యవహరించారు. అంతకుముందు దేవస్థానంలో పల్లకి సేవ కార్యక్రమాలను దేవస్థానం ఆధ్వ ర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. సోమవారం వంద కిలోల పండ్ల రసాలతో పూజలు ఆలయంలో



బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వంద కిలోల మామిడి పండ్ల రసాలతో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారికరుణా కటాక్షాలు పొందాలని ఆయన పేర్కొన్నారు.

## జనసేన పాత నాయకులందరు తరలిరండి

### జనసేన నాయకులు బెల్లం కొండ కిషోర్



**బుచ్చి జూన్ 28 ప్రభాతవార్త** జనసేన పార్టీ వ్యవస్థాపకులు, డిప్యూటి సిఎం పవనకళ్యాణ్‌ని స్ఫూర్తిగా తీసుకొని జనసేన పాత నాయకు లందరు చేయిచేయి కలిపి పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని జనసేన నాయకులు బెల్లం కొండ కిషోర్ పిలుపునిచ్చారు. ఆదివారం అంబేద్కర్ భవనంలో జరిగిన జనసేన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతు కోవూరు నియోజకవర్గం మాజీ అధ్యక్షులు చప్పిడి శ్రీనివాసులు నాయకత్వంలో పాత నాయకులు అందరితో కలిసి నేడు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని చెప్పారు. పార్టీని బలోపేతం చేస్తు ప్రజా సమస్య పట్ల గళం విపుతు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. మండలంలోని ప్రజలు సమస్యలు ఎక్కడ వున్న జనసైనికులు దృష్టికి తీసుకొని రావాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పాత జనసైనికులు పార్టీ కి దూరంగా ఉంటున్నారని అటువంటి వారందరు కలిసి పార్టీని బలోపేతం చేసేందుకు ముందుకు రావాలని అన్నారు. స్దానిక సంస్దల ఎన్నికలలో పార్టీని విజయపదంలో నడిపించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో కరకం బాకం శ్రీనివాసులు, పల్లాపల్లి ఇబ్రహీం, రాజా, సాయి,ఖాజా, విష్ణు, హరి,సునీల్, జనసైనికులు పాల్గొన్నారు.

## హనుమంతసేవ వాహనంపైన ఆత్మారామస్వామివారు



**సంగం జూన్ 28 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలో శ్రీ సీతాలక్ష్మణ సమేత ఆత్మారామస్వామి వారి సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారు హనమంతసేవ ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని వివిధ రకాల పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా గున్నంరెడ్డి మీనమ్మ స్పెసిఫిక్ ఎండోమెంట్,ఇందుపూరు రాఘవరెడ్డి సన్స్, కీర్తి శేషులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి కుమారులు హరిష్‌రెడ్డి,యశ్వంత్‌రెడ్డి, కీర్తిశేషులు మంగలపూడి యానాదిరెడ్డి -శిరిష,వారి కుమారులు,కోడలు వ్యవహారించారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఆనం ప్రసాద్‌రెడ్డి



**సంగం జూన్ 28 ప్రభాతవార్త** సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామంలోని ప్రాధమిక పాఠశాలలో చిన్నారులకు మాజీ సర్పంచ్ టిడిపినాయకులు ఆనం ప్రసాద్‌రెడ్డి పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో పడమటిపాళెం నీటి సంఘం డైరక్టర్ కనుమూరు సుధాకర్‌రెడ్డి, ఏఎన్ఎం రాజమ్మ,అంగన్‌వాడీ వర్కర్ సుగుణమ్మ, ఆశావర్కర్ వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



**కావలి, జూన్ 28 ప్రభాతవార్త :** పోలియో రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పోలియో రహిత కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలీయో చుక్కలు వేయించడం తల్లిదండ్రులు బాధ్యత అని అన్నారు. పట్ట ణంలోని 10వ వార్డు మున్సిపల్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి పోలియో చుక్కలను చిన్నారులకు వేయడం జరిగింది. ప్రతి చిన్నారి పోలీయో చుక్కలు వేయించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తొందని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం అత్యాధునిక వైద్య సేవలు, టీకాలు కార్యక్రమాలు గ్రామీణ స్థాయి వరకు విస్తరింప చేస్తొందని తెలిపారు. పల్స్‌పోలియో వంటి ప్రమాదకర వ్యాదులను తరిమికొట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పోలియో కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మున్సిపల్ ఆవరణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎలిషాబాబు, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డిప్యూటిడిఎంఅండ్‌హెచ్‌ఓబ్రిజిత, టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబూరావు, 10వ వార్డు ఇన్‌చార్జ్ వల్లేరు వెంకటకిరణ్‌కుమార్, వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## కాకినాడ రూరల్ ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



**కావలి, జూన్ 28 ప్రభాతవార్త :** వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అవమానకర వ్యాఖ్యలు చేసినందున ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో వైసిపి నేతలు ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ మాజీ సిఎం జగన్‌రెడ్డిపై కాకినాద రూరల్ ఎమ్మెల్యే అసభ్యకర పదజాలాలతో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం జరిగిందన్నారు. దీనిని ఖండిస్తూ ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి కాకినాడ రూరల్ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, జిల్లా ఎస్‌సిసెల్ అధ్యక్షులు పందిటి కామరాజు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వెంగలశెట్టి కళ్యాణి తదితర వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా దర్గాను దర్శించుకున్నా కోటంరెడ్డి ఫ్యామిలీ

### - గిరిధర్ రెడ్డి శాసనసభ్యులు కావాలని ఆకాంక్షిస్తూ తొలిరొట్టె

### - స్వర్ణాల చెరువులో రొట్టెలు వదిలిన కోటంరెడ్డి కుటుంబ సభ్యులు





**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త - కలెక్టరేట్** రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ రొట్టెను అందుకోవడం జరిగిందని నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సతీమణి కోటం రెడ్డి సుజిత తమ్ముడు కోటం రెడ్డి గిరిధర్ రెడ్డితో కలిసి స్వర్ణాల చెరువులో రొట్టెలు వదిలిన అనంతరం బారాషహీద్ దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ తమ్ముడు కోటం రెడ్డి గిరిధర్ రెడ్డి శాసనసభ్యులుగా కావాలని ఆకాంక్షిస్తూ తొలిరొట్టె అందుకోవడం జరిగిందని, రెండవ రొట్టె రాష్ట్ర అభివృద్ధి కాంక్షిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నేత నారా లోకేష్ రాష్ట్రాన్ని అభివృద్ధిపై దిశగా నడిచే విధంగా ఉంచాలని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తూ మూడవ రొట్టె అందుకోవడం జరిగింది అన్నారు. లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చి రాష్ట్రం అభివృద్ధి పథంలో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. తాను గత రెండు కార్యాలుగా శాసనసభ్యులుగా ఉండడం జరిగిందని 12వ సారి బారా షహీద్ దర్గా రొట్టెల పండగలో పాల్గొనడం జరిగింది అన్నారు. పవిత్ర దర్గా తన నియోజకవర్గ పరిధిలో ఉండడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. బారాషాహిద్ దర్గాను దర్శించుకోవడం అనేది కుటుంబ పరంగా వస్తున్న ఒక సెంటిమెంట్‌గా ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల కాలవ్యవధిలో నియోజకవర్గ పరిధిలో సుమారు 700 కోట్ల రూపాయల మేర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని కొన్ని పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయని ఆయన తెలిపారు. రానున్న కాలంలో దర్గా మరింత అభివృద్ధి చేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

## 30న ఏపీఎప్‌సెట్ ఫలితాలు విడుదల ?

**కోట,జూన్ 28 ప్రభాతవార్త** ఏపీలో లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ఎప్‌సెట్ ఫలితాలు విడుదలకు రంగం సిద్దమైంది. ఈ ఫలితాలను ఈ నెల 30 న విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ అధికార వర్గాలు తెలిపాయి. విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను విడుదల చేస్తారు.మే 12 నుంచి 20 వరకు ఎప్‌సెట్ పరీక్షలు జరిగాయి. షెడ్యూల్ ప్రకారం అయితే జూన్ 1నాటికే ఈ ఫలితాలు వెలవడాల్సింది. అయితే ఇంటర్ మార్కులుకు 25 శాతం వెయిటేజీ ఉండటంతో ఏ ఒక్క విద్యార్ధికి నష్టం జరగకూడదనే ఉద్దేశంతో ద్వీతీయ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఫలితాలు సీబీఎస్ఈ ఫలితాలు పూర్తి స్దాయి ఫలితాలు ప్రక్రియ తుది దశకు చేరడంతో ఈ నెల 30 న ఎప్‌సెట్ ఫలితాలును విడుదల చేయన్నున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## పాత వారికి కోతలు.. కొత్తవారికి ఎదురుచూపులు

### - పిఎం కిసాన్ సహాయం పొందలేకపోతున్న రైతులు



**కోట, జూన్ 28 ప్రభాతవార్త** రైతులకు పెట్టుబడి సాయం అందించి సాగుకు చేయూతనివ్వాలన్న లక్ష్యంతో కేంద్రప్రభుత్వం 2018-19 లో పిఎంకిసాన్ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ఏటా మూడు విడతల్లో రూ.6 ఏలు చొప్పున సాయం అందిస్తుంది. ఈ పథకం ప్రారంభం నాటితో పోలిస్తే క్రమేణా లబ్ధిదారుల సంఖ్య తగ్గుతోంది. పథకం ప్రారంభంలో రెండేళ్ల పాటు అనర్హులు సైతం లబ్ధి పొం దా రు.ఉద్యోగులు, ఒకే కుటుంబంలో రెండులేదా అంతకంటే ఎక్కువ మంది పేర్ల మీద వ్యవసాయ భూమి ఉన్నా అందరికీ వర్తించింది. ఆ తర్వాత ఫిర్యాదులు అందడంతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వారిని ఆధార్ అనుసంధానం ద్వారా గుర్తించి తొలగించారు. ఈకేవైసీ, రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదులో వెనుకబాటుతోను మరికొందరు లబ్ధి పొందలేకపోతున్నారు. రానురాను రైతుల సంఖ్య తగ్గిపోతో వస్తోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో హామీ మేరకే కూటమి ప్రభుత్వం పిఎంకిసాన్-అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల చొప్పున అందిస్తుంది. అందులో రూ.6 వేలు కేంద్రప్రభుత్వం, రూ.14 వేలు రాష్ట్రప్రభుత్వం సమకూరుస్తున్నాయి.

**నమోదుకు అవకాశం లేక..** 2019 ఫిబ్రవరి 1వ తేదీకి ముందు పట్టాదారు పాస్‌పుస్తకం కలిగి ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్ అడంగళ్‌లో పేర్లు ఉన్న రైతులకే పిఎంకిసాన్ వర్తింపచేశారు. అప్పట్లో రెవెన్యూ సమస్యలతో పుస్తకాలు లేక కొత్తగా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసుకున్నప్పటికీ కేంద్రప్రభుత్వం దరఖాస్తులు చేసుకునే అవకాశం ఇవ్వని కారణంగా ఎక్కువమంది రైతులు పిఎంకిసాన్ లబ్ధికి దూరమయ్యారు. కోట మండలంలో అన్నదాత సుఖీభవ లబ్ధిని ఎక్కువమంది పొందినప్పటికీ, మరికొన్ని గ్రామాల్లో రైతులకు పిఎంకిసాన్ కింద రూ.2 వేలు జమ కాలేదు. ఆ మేరకు వ్యవసాయ కార్యాలయానికి వచ్చి రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు.

## వైభవంగా గంగమ్మ తల్లి గ్రామోత్సవం



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త - అగ్రికల్చర్** నెల్లూరు రూరల్ మండలం కొమ్మరపూడి గ్రామంలో కొలువై ఉన్న గంగమ్మ తల్లి వార్షిక తిరుణాళ్ల మహోత్సవం మూడు రోజులపాటు వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. బాణాసంచా పేలుళ్ల వీరతాళ్ళ మోతలు, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య అమ్మవారి ఊరేగింపు (గంగ పెట్టి ఉత్సవం) గ్రామంలోని వీధులలో వేడుకగా నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారికి కాయా కర్పూరం సమర్పించి తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. మూడు రోజులపాటు అన్నదానాలను ఏర్పాటు చేశారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మ తల్లీ మమ్ము కరుణించి మాకు వరములివ్వమ్మా అంటూ వేడుకున్నారు. తల్లి ఆశీస్సులు పొందుతున్న అనేకమంది దాతల సహకారంతో మున్ముందు గంగమ్మ తల్లి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తామని కొమ్మరపూడి ఆలయ కమిటీ పెద్దలు పచ్చిపాల శ్రీనివాసులు తెలియజేశారు.

## సర్ కార్యక్రమం మరింత వేగవంతం కావాలి



**కోవూరు, జూన్ 28 ప్రభాతవార్త :** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరుగుతున్న సర్ కార్యక్రమం మరింత వేగవంతం కావాలని డిప్యూటీ ఎంపీడీవో సురేష్ అన్నారు. కోవూరు మండలం చెర్లోపాలెం గ్రామంలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బీఎల్ఓ వారికి కేటాయించిన పోలింగ్ బూత్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు.

## మండలంలో పల్స్ పోలియో విజయవంతం



**కోవూరు, జూన్ 28 ప్రభాతవార్త :** ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో నివారణ పూర్తిగా నివారంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పోలియో చుక్కల కార్యక్రమం పూర్తిగా విజయవంతం అయిందని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నిరంజన్ అన్నారు. కోవూరు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం ఆయన పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలియో వ్యాధిని పూర్తిగా నివారంచేందుకు పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు వారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సూచించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది,ఆశా,అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో మండలంలో పూర్తిగా విజయవంతం అయిందన్నారు.

## నేటి నుంచి సహకార వారోత్సవాలు



**కోవూరు, జూన్ 28 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు ప్రాథమిక సహ కార సొసైటీలో ఈ నెల 29వ తేది నుంచి వారం రోజుల పాటు సహకార వారో త్స వాలు సహకార శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందని సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ 29వ తేది సహకార వారోత్సవాల సందర్భంగా జెండా ఎగురవేసి సహకార సంఘ సభ్యులచే ప్రతిజ్ఞ నిర్వహించి ప్రత్యేక స మావేశం ఏర్పాటు చేయాలన్నారు. అదేవి ధంగా 30వ తేది మత్స్యకారులతో రచ్చబండ, జూలై 1వ తేది సొసైటీ పరిధిలో మెడి కల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి.. 2వ తేది పాడి రైతులతో రచ్చబండ కార్యక్రమాన్ని , 3వ తేది ప్లాస్టిక్ వాడకం నిర్మూలన, 4వ తేది ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ డే కార్యక్రమాన్ని , 5వ తేది కామన్ సర్వీస్ సెంటర్ కార్యక్రమాలను, ఆఖరి రోజు ఈ వారోత్సవాల సందర్భంగా సొసైటీ చేసిన అభివృద్ధి, తదితర కార్యక్రమాలను రైతులకు వివరించేలా చొరవ తీసుకోవాలన్నారు. ఈ వారోత్సవాల్లో సొసైటీ పరిధిలోని రైతులు తప్పక హాజరు కావాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## ఉగ్గబట్టి ఉండాల్సిందే..!

### చాలచాలని మూత్రశాలలు,మరుగుదొడ్లు, ప్రవేటు పాఠశాలల్లో విద్యార్దులకు తప్పని ఇక్కట్లు

**కోట,జూన్ 28 ప్రభాతవార్త** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్దుల సంఖ్యకు తగిన విధంగా మూత్ర శాలలు ,మరుగుదొడ్లు లేక అవస్దలు పడుతుంటారు. ఇదే పరిస్దితి కొన్ని ప్రవేటు పాఠశాలల్లోనూ నెలకొంది. విద్యార్దుల నుంచి ముక్కుపిండి మరీ ఫీజులు వసూలు చేసే యాజమన్యాలు ఆస్దాయిలో సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తుంది. రూ వేలుకు వేలు ఫీజులు కట్టే తల్లిదండ్రులు తమ పిల్లలకు అన్ని సౌకర్యాలు ఆశించడం సహజం. కానీకోట మండలంలోని కొన్ని ప్రవేటు విద్యా సంస్దలు విద్యార్దులు సంఖ్యకు సరిపడ్డా మూత్రశాలలు ,మరుగుదొడ్లు సౌకర్యం కల్పించలేకపోతున్నాయి. ఫలితంగా పిల్లలు పలు సమస్యలు ఎదుర్కోంటున్నారు. విరామ సమయాల్లో చిన్నారులు భారీ క్యూలైన్లు కడుతూ సమయం చాలక మూత్ర విసర్జన ఆపుకొని తిరిగి తరగతి గదుల్లోకి వెళ్లిపోతున్నట్లు పరిశీలనలో తేలింది.

**ప్రమాణాలు పాటింపు ఏదీ ..?** ప్రతి 12 మంది విద్యార్దులకు ఒక మూత్ర శాల 20 మందికి ఒక మరుగుదొడ్డి ఉండాలని నిపుణులు సూచించిన ప్రమాణం. విద్యాశాఖ సైతం ఇదే ప్రమాణాలను పరిగణలోకి తీసుకొని పర్యవేక్షించాలి. కాని కొని ప్రవేటు విద్యా సంస్దల్లో సౌకర్యాల విషయంలో తనిఖీ చేసిన దాఖలాల్లేవు. చాల మంది తల్లిదండ్రులు పిల్లలు మార్కులు ప్రగతి నివేదికల పై చూపుతున్న శ్రద్ద.. వారి ఆరోగ్యంతో ముడి పడి ఉన్న విషయంలో చూపటం లేదంటున్నారు నిపుణులు.

ఉదయం ఇంటి వద్ద, మళ్లీ తిరిగి సాయంత్రం పాఠశాల వదిలాక 5 గంటలకు ఇంటికి వచ్చాకే తమ పిల్లలు మూత్ర విసర్జన చేస్తున్నట్లు కొందరు తల్లిదండ్రులు ఆనారోగ్య సమస్యలు వచ్చినట్లు చెబుతున్నారు. క్యూలైన్ ఎక్కువగా ఉండటం.. మూత్ర శాలల ఆపరిశుభ్రంగా ఉండి ఇష్టం లేక మూత్ర విసర్జన ఆపుకొన్నట్లు పిల్లలు చెబుతున్నట్లు మరి కొందరు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కిడ్ని సమస్యలోస్తున్నాయి :** పిల్లలు ఎక్కువగా నీరు తాగాలి. సకాలంలో మూత్ర విసర్జన చేయాలి. తరగతి మద్యలో విద్యార్దులు మూత్ర విసర్జనకు బయటకు వెళితే సమయం వృదా అవుతోందని భావిస్తూ కొన్ని పాఠశాలల్లో నీరు ఎక్కువగా తాగనీయడం లేదని కొందరు తల్లిదండులు మాతో చెప్పారు. నీరు తక్కువగా తాగితే కిడ్ని సమస్యలోస్తాయి. మూత్ర విసర్జన సకాలంలో చేయకుంటే మూత్రనాళంలో ఇన్‌ఫెక్షన్ వస్తుంది. బాలురతో పోల్చుకుంటే బాలికల్లోఈ సమస్య ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**వివరణ:** ఈ విషయంపై కోట మండల విద్యాశాఖధికారి..2 మస్తానయ్య ను ప్రభాతవార్త వివరణ అడగగా విచారణ జరిపి నిబంధనలు ప్రకారం లేకపోతే ఆయా స్కూళ్ల పై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసిన అమర



**కావలి, జూన్ 28 ప్రభాతవార్త :** కావలి 40వ వార్డులో కామాటివారివీధిలో ఉన్న సచివాలయంలో పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి 3వ క్లస్టర్ కోకన్వీనర్, మాజీ పట్టణ అధ్యక్షులు అమరవేదగిరి సుబ్బరాయుడు గుప్త పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళు లోపు చిన్నారుకలు పోలియో చుక్కలు వేయించి నియోజకవర్గాన్ని పోలియో రహిత నియోజకవర్గంగా తీర్చి దిద్దాలన్నదే కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి ధ్యేయ మని తెలిపారు. ఐదేళ్ళలోపు పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ రాధిక, వైద్యసిబ్బంది పాల్గొన్నారు

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత న్యూరాలజీ మెడికల్ క్యాంప్




**చిల్లకూరు, జూన్ 28, ప్రభాతవార్త** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ బిందు మీనన్ ఫౌండేషన్ సహకారంతో చిల్లకూరు మండలం మన్నెగుంట గ్రామంలో ఉచిత న్యూరాలజీ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందు మీనన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యంగా మారుమూల ప్రాంతాల ప్రజలు న్యూరాలజీ పై అవగాహన కలిగి ఉండాలని, మూర్చ వ్యాధి, బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం లక్షణాలను విసదీకరిస్తూ, వాటికి తక్షణముగా తీసుకొనవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 120 మంది నరాల సంబంధిత వ్యాధిగ్రస్తులను పరిశీలించి, వారికి వివిధ రకములైన టెస్టులు నిర్వహించి ఉచితముగా డాక్టర్ బిందు మీనన్ ఫౌండేషన్ ద్వారా మందులు ఇచ్చారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు అక్కన రమణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పిఆర్ లయన్ గిరినాథ్, లయన్ మల్లెమాల మురళి రెడ్డి, వాకాటి రామ్మోహన్, మదనమేటి రమణయ్య, జక్కం రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మనుబోలు రూపేష్ రెడ్డి, వీరేంద్రనాథ్, కళ్యాణ సాయి, ప్రముఖ అడ్వకేట్ లయన్ రజనీకాంత్ రెడ్డి, మహేష్, కె. శివయ్య, చింతల రాఘవయ్య, జోసెఫ్ మొదలు వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి క్యాంప్ చైర్మన్‌గా లయన్ బ్రహ్మ దేవి సీనయ్య, ఆర్గనైజర్‌గా మన్నెగుంట గ్రామస్తులు తిప్పరాజు శ్రీనివాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో గ్రామ ప్రజలు డాక్టర్ బిందు మీనన్ గారిచే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

## పోలియో రహిత జిల్లా మన లక్ష్యం

### - డీయం అండ్ హెచ్ఓ డాక్టర్ వి. సుజాత



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త - వైద్యం** పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు అందరూ సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి వి. సుజాత పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె నెల్లూరులోని శెట్టిగుంట రోడ్డు వైపి మున్సిపల్ స్కూల్లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ నెల్లూరు జిల్లాను పోలియో రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందరూ సహకరించాలని కోరారు. జిల్లాలో గుర్తించిన 2,67,750 మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 83 మొబైల్ బూతులను, ప్రయాణాల్లో ఉన్న పిల్లలకు చుక్కలు వేయడానికి 88 ట్రాన్సిట్ బూత్‌లను ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు. జిల్లాలోని ఐదు సంవత్సరాల లోపు పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లలకు తప్పనిసరిగా మొదటి రోజే ఆదివారం పోలియో చుక్కలు వేయించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఏదైనా కారణం చేత మొదటి రోజు వేయించని పక్షంలో పిల్లలకు రెండో రోజు, మూడో రోజు 30 వ తారీకు వరకు వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, డెమో కె. కనక రత్నం, స్టాటిస్టికల్ ఆఫీసర్ సహన, వైద్యాధికారులు ధనలక్ష్మి, డాక్టర్ మౌనిక, డాక్టర్ కార్తీక్, డిప్యూటీ హెచ్ఈఓ వెంకటేష్, హెల్త్ సూపర్వైజర్ రామ కృష్ణ, కరుణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త - వైద్యం** నెల్లూరు విద్యుత్ భవన్‌లో ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్.ఈ. కార్యక్రమం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు 0861-2320427 నెంబర్‌లో నిర్వహించబడుతుందని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం తెలిపారు. అలాగే, ఏపిఎస్‌పిడిసిఎల్ సిఎండీ ప్రతి సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ సిఎండీ కార్యక్రమాన్ని ఉదయం 10.00 నుండి మధ్యాహ్నం 12.30 వరకు 8977716661 నెంబర్‌లో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వినియోగదారులు తమ విద్యుత్ సంబంధిత సమస్యలు, సూచనలు నేరుగా తెలియజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ రాఘవేంద్రం కోరారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి : ఎమ్మెల్యే



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త - వైద్యం:** పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా అల్లీ పురంలోని తన నివాసంలో చిన్నారులకు సర్వే పల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పోలియో చుక్కలు వేశారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయిం చాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.

## సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు ఫ్యాప్టో వినతి



**వింజమూరు, జూన్ 28, ప్రభాతవార్త** విద్యా రం గంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిం చాల ని ఆదివారంఫ్యాప్టో (ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) ప్రతినిధులు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుండి మినహాయించాలని కోరారు. విద్యా హక్కు చట్టం 2009 సవరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని, అప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. 5 ఏళ్లకు పైబడి సర్వీసు ఉన్న టీచర్లు కూడా టెట్ పాస్ కావాలని, ప్రమోషన్ కావాలన్నా టెట్ తప్పనిసరి అని తీర్పు ఇచ్చిందని, సర్వీసులో ఉన్న టీచర్లకు పాఠాలు చెప్పుకుంటూ టెట్‌కు ప్రిపేర్ అవ్వడానికి సమయం చాలదన్నారు. టెట్ తప్పనిసరి చేస్తే స్కూళ్లకు సెలవులు పెట్టి చదవాల్సి వస్తుంది. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు అంతరాయం కలిగే విధంగా ఉందన్నారు. కనుక చట్ట సవరణ జరిగే వరకు ఇన్‌సర్వీస్ టీచర్లకు ఆఫ్‌లైన్‌లో ప్రత్యేక టెట్ నిర్వహించాలి. అందరికీ సమానంగా 40 శాతం ఉత్తీర్ణత మార్కులు, బోధించే సబ్జెక్టు ఆధారంగా సిలబస్ ఉండాలని కోరారు. పిఆర్‌సి కమిషన్ నియమించాలన్నారు. ఐఆర్ ఇంటీరియన్స్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్, ఏపీటీఎఫ్, పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలన ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వనిపెంట హైమావతి, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వేపల్లిలో సోలార్ వెలుగులు

### - వెంకటాచలంలో రూ.1.50 కోట్లతో సోలార్ వీధిదీపాలు ఏర్పాటు

### - సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి





**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త - వైద్యం:** సర్వేపల్లి నియోజకవర్గంలో సోలార్ వెలుగులు విరాజిల్లుతున్నాయి. అందులో భాగంగా నియోజకవర్గంలోని వెంకటాచలంలో రూ.1.50 కోట్లతో ఏర్పాటు చేసిన సోలార్ వీధిదీపాలను సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోనూ సౌరవీధి దీపాలును ఎస్ఈఐఎల్ కంపెనీ ఏర్పాటు చేస్తోందన్నారు. ఒక్కో వీధిలైటుతో పాటు స్తం భానికి రూ.60 వేలు వెచ్చిస్తున్నారని, రెగ్యులర్ కార్యక్రమాలతో పాటు సీఎస్ఆర్ నిధు లతో అదనపు హంగులు ఏర్పాటు చేస్తున్నార న్నారు. అదేవిధంగా హాస్పిటళ్లు, పాఠశాలలు, గిరిజన కాలనీలకు కొత్తరూపు సంతరించు కుంటోందన్నారు. అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్న సర్వేపల్లి నియోజకవర్గంలోని కంపెనీల యాజమాన్యాలు, ప్రతినిధులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆటోమేటిక్ గా ఆన్ అండ్ ఆఫ్ అయ్యే టెక్నాలజీతో వీధిదీపాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదట క్రికెట్ టోర్నమెంటు విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. 18 జట్లు పాల్గొన్న క్రికెట్ టోర్నమెంటులో విజేతగా గుడ్లూరువారిపాళెం ఈఎంఆర్ జట్టు నిలవగా, రెండో స్థానంలో వెంకటాచలం ఎస్ఆర్‌బీ టీమ్ నిలిచింది. విన్నర్స్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేలు నగదు బహుమతులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అందించారు. అనంతరం క్రీడాకారులతో పాటు టోర్నమెంటు ఆర్గనైజర్లకు ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం వెంకటాచలం కమ్యూనిటీ హెల్త్ సెంటరు ఆవరణలో రూ.7 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.

## రైల్వే సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

**బిట్రగుంట జూన్ 28 ప్రభాతవార్త** విజయవాద రైల్వే డివిజన్ పరిధిలోని తిరుపతి నుండి పూరి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు నుండి బయలుదేరగానే బి1 కంపార్ట్మెంటులో చివరి భాగాన పొగలు రావడంతో సిబ్బంది అప్రమత్తమై పొగలను అదుపు చేశారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. దీని కారణంగా పది నిమిషాల పాటు రైలు పరుగుకు అంతరాయం కలిగినట్లు తెలిసింది